క్లుప్తంగా

జడ్చర్లలో జాబ్‌మేళా

జడ్చర్ల టౌన్: తెలంగాణ స్కిల్స్ అండ్ నాలెడ్జ్ సెంటర్, ఐక్యూసీ ఆధ్వర్యంలో ఎల్‌అండ్‌టీ కంపెనీ వారి సహకారంతో గురువారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపాల్ డా. అప్పియాచిన్నమ్మ, నాలెడ్జ్ సెంటర్ రీజినల్ మేనేజర్ సిరాజుద్దీన్ సూచనలు చేశారు. కో ఆర్డినేటర్ డా.రమాదేవి, ఎల్‌అండ్‌టీ ప్రతినిధులు నరేష్, శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

నేడు న్యాచురోపతి శిబిరం

జడ్చర్ల టౌన్: పట్టణంలోని రమాసహిత సత్యనారాయణస్వామి మందిరంలో శుక్రవారం ఉచిత ఆక్యుపంక్చర్, న్యాచురోపతి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు చిత్తనూరి ఈశ్వర్ తెలియజేశారు. శిబిరంలో హీలర్‌విజయలక్ష్మి ఆధ్వర్యంలో పరీక్షలు చేసి అవసరమైన చికిత్స అందిస్తారని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

రాజకీయ పార్టీల వాల్‌పోస్టర్లు తొలగింపు



బాలానగర్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అధికారులు రాజకీయ పార్టీల వాల్‌పోస్టర్ల తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టారు. ఇప్పటికే మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో పోస్టర్లను తొలగించారు. తాజాగా మండల కేంద్రంలో పెండింగ్‌లో ఉన్న వాటిని కార్యదర్శి జగన్‌నాయక్ సిబ్బందితో తొలగింప జేశారు.

నిబంధనలు పాటించని వారికి జరిమానా



బాలానగర్: వాహనదారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని అసిస్టెంట్ మోటర్ వెహికిల్ ఇన్స్‌పెక్టర్ స్వాతి గౌడ్ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని జాతీయ రహదారి–44పై సిబ్బందితో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. నిబంధనలు పాటించని అయిదు మంది వాహనదారులకు జరిమానా విధించారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యానికి మేలు

మహమ్మదాబాద్: మండల కేంద్రంలోని నంబర్2 అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు గురువారం సామూహిక సీమంతం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మల్లమ్మ మాట్లాడుతూ తల్లీబిడ్డల ఆరోగ్యానికి పౌష్టికాహారం మేలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్స్ లలిత, అరుణ, సరిత, రాధిక, వేణుగౌడ్, తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

సత్తాచాటిన మేడిగడ్డ తండా క్రీడాకారులు

బాలానగర్: జిల్లాస్థాయి క్రికెట్ టోర్నీలో మేడిగడ్డ తండా క్రీడాకారులు సత్తా చాటారు. గురువారం జరిగిన తుదిపోరులో రంగారెడ్డి జిల్లా బూర్గుల టీంతో పోటాపోటీగా ఆడి గెలుపొందారు. మొదటి బహుమతిగా రూ.50 వేలు, ట్రోఫీని దక్కించుకున్నారు. రన్నరప్‌గా బూర్గుల జట్టు రూ. 25 వేలు, ట్రోఫీ దక్కించుకుంది. మొత్తం 40 జట్లు టోర్నీలో పోటీపడ్డాయి. వినోద్, దేవేందర్, వీరేష్, సంజీవ్, రేడ్య, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కోటచింతల బ్రహ్మోత్సవాలు



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు



అగ్నిగుండం తిలకిస్తున్న జనం

నవాబుపేట: కోటచింతల బసవేశ్వరస్వామి దేవాలయ ఉత్సవాల్లో భాగంగా గురువారం తెల్లావారుజామున శివభక్తులు అగ్ని గుండంలో నడిచి భక్తిని చాటుకున్నారు. తెల్లవారు జామున రథోత్సవం నిర్వహించి అనంతరం అగ్నిగుండం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ఓ నమః శివాయ అంటూ భగవన్నామ స్మరణ చేశారు. మరికల్, కిష్టంపల్లి, బంగ్రంపల్లి, అగ్రహారం గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున వేడుకల్లో పాల్గొన్నారు. అదేవిధంగా సాముహికంగా రథోత్సవం నిర్వహించినట్లు ఉత్సవ నిర్వాహకులు రాజేష్, సిద్ధయ్య, శర్మ తెలిపారు. అనంతరం భక్తులకు నర్సింహారెడ్డి అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు పాండు, సత్యం, శివ, శేఖర్, రాజేష్, సుధాకర్‌రెడ్డి, రామ్మోహన్‌శర్మ, అమర్‌నాథ్‌రెడ్డి, మధు, చరణ్, నరేందర్, చారీ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పక్షులకు నీటి తొట్ల ఏర్పాటు



నీటి తొట్ల ఏర్పాటును ప్రారంభిస్తున్న వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ ఏబీవీపీ ఆధ్వర్యంలో చేపట్టిన సకోరా కార్యక్రమంలో భాగంగా పక్షులకు నీటితొట్లను ఏర్పాటు చేశారు. వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్ ఏర్పాటు కార్యక్రమాన్ని ప్రారంభించారు. వేసవి కాలం నేపథ్యంలో నీటికి, ఆహారానికి ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని విద్యార్థులు పక్షుల కోసం తొట్లు ఏర్పాటు చేయడం అభినందించదగ్గ విషయం అన్నారు. ఎస్ఎఫ్‌డీ కన్వీనర్ ఓం ప్రకాష్, ఏబీవీపీ నాయకులు అర్జున్, కృష్ణ, శివప్రసాద్, జైపాల్, శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీటీసీ సభ్యురాలికి పరామర్శ



ఎంపీటీసీ భాగ్యశ్రీ ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

నవాబుపేట: అమ్మపూర్ ఎంపీటీసీ సభ్యులురాలు భాగ్యశ్రీ అనారోగ్యంతో జిల్లా కేంద్రంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఆస్పత్రికి వెళ్లి ఆమెను పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన సేవలు అందించాలని సూచించారు. కాగా ఎమ్మెల్యేను చూసి 'సార్ మీ గొంతునొప్పి తగ్గిందా.. రెస్ట్ తీసుకోండి' భాగ్యశ్రీ అన్నారు. దీంతో ఎమ్మెల్యే మీరు బాగుంటే నేను బాగుంటాను అంటూ సమాధానం ఇచ్చారు.

తెలంగాణలో బీఆర్‌ఎస్ ఉండదు



కాంగ్రెస్‌లో చేరిన కౌన్సిలర్లు, నాయకులతో ఎమ్మెల్యే తదితరులు

స్టేషన్ మహబూబ్‌నగర్: సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమం కోసం నిరంతరం పని చేస్తామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో గురువారం బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు మునీర్, షేక్ ఉమర్, నాయకుడు చిన్నతో పాటు 200 మంది నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచకాలు, ఆక్రమణలు, దోపిడీ రాజ్యం పోయి ప్రజలు స్వేచ్ఛగా సంతోషంగా జీవించేలా కాంగ్రెస్ ప్రజాపాలన సాగిస్తోందన్నారు. తెలంగాణ గడ్డపై ఇక బీఆర్‌ఎస్ ఉండదన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ మధ్యే పోటీ ఉంటుందని తెలిపారు. ఎవరెన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, వైస్ చైర్మన్ షబ్బీర్, నాయకులు ఎన్పీ వెంకటేశ్, నాయకులు సీజే బెనహర్, సిరాజ్‌ఖాద్రీ, బెక్కరి అనిత, ఫయాజ్, లక్ష్మణ్‌యాదవ్, తఖీయెద్దీన్, తిరుమల వెంకటేశ్, పాష, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు..

జిల్లా కేంద్రం సద్దల్‌గుండ్‌లోని అలీబా అబ్దుల్లా మజీద్‌లో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన ఇఫ్తారు విందులో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ పాల్గొన్నారు. యెన్నం మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో ప్రతి ఒక్కరూ కూడా ఆనందంగా ఉపవాస దీక్షలు చేస్తూ ఆ భగవంతుని ఆశీస్సులు పొందాలని కోరుతున్నట్లు తెలిపారు. మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, వైస్ చైర్మన్ షబ్బీర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్, రహెమాన్‌సోఫీ తదితరులు పాల్గొన్నారు.

డీడీఎన్‌ఎస్ రాష్ట్ర కమిటీలో జిల్లాకు చోటు



జంగం వీరన్న



రవికుమార్



జంగం మహేష్

స్టేషన్ మహబూబ్‌నగర్: తెలంగాణ రాష్ట్ర దూప, దీప నైవేద్య అర్చక సంఘం నూతన కార్యవర్గంలో జిల్లావాసులకు చోటు దక్కింది. గురువారం హైదరాబాద్‌లో రాష్ట్ర దూప, దీప నైవేద్య అర్చక సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ కార్యవర్గంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా జంగం వీరన్న, రాష్ట్ర అధికార ప్రతినిధిగా జీ.రవికుమార్, సహాయ కార్యదర్శిగా జంగం మహేష్ ఎన్నికయ్యారు. ప్రస్తుతం వీరన్న డీడీఎన్ఎస్ జిల్లా అధ్యక్షుడిగా, రవికుమార్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా, జంగం మహేష్ జిల్లా కోశాధికారిగా వ్యవహరిస్తున్నారు. జిల్లా ప్రతినిధులు ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

దుస్తులు తెచ్చుకుంటానని వెళ్లి..

● బాలిక అదృశ్యం

అడ్డాకుల: మండలంలోని కందూర్ గ్రామానికి చెందిన బాలిక అదృశ్యమైనట్లు ఎస్ఐ ఎం.శ్రీనివాస్ తెలిపారు. బాలిక తండ్రి కర్ణాటకలో తమ్ముడితో పాటు ఆమె తమ బాబాయి వద్ద కందూర్‌లోనే ఉండేదన్నారు. కాగా ఈనెల 19న అడ్డాకులలో దుస్తులు తెచ్చుకుంటానని ఇంట్లో చెప్పి ఎక్కడికో వెళ్లిపోయిందన్నారు. కుటుంబ సభ్యులు, బంధువులు అంతటా వెతికినా ఆచూకీ లభించకపోవడంతో.. ఆమె తండ్రి గురువారం కర్ణాటక నుంచి వచ్చి తమకు ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

ఇసుక నిల్వల పరిశీలన

మిడ్జిల్: అయ్యవారిపల్లి శివారులో సీజ్ చేసిన ఇసుకను మహబూబ్‌నగర్ ఆస్పత్రి నిర్మాణానికంటూ ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని ఫిర్యాదు అందడంతో.. అధికారులు గురువారం పరిశీలించారు. జిల్లా మైనింగ్ ఏడీ సంజయ్‌కుమార్ ఆదేశాల మేరకు గురువారం మైన్స్ సర్వేయర్ సుజాత, మిడ్జిల్ ఆర్ఐ అంబిక చర్యలు చేపట్టారు. ప్రస్తుతం ఉన్న ఇసుక నిల్వలను కొలతలను వేసి జిల్లా అధికారులకు నివేదికలు ఇస్తామని తెలిపారు. వారి వెంట జూనియర్ అసిస్టెంట్ కృష్ణయ్య, బీజేపీ నాయకులు తిరుపతి, నరేందర్, తదితరులు ఉన్నారు.

పాఠశాలలో సౌకర్యాలు భేష్..!



నవాబుపేట: ఇప్పటూర్ ప్రాథమిక పాఠశాలను గురువారం ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్, సీఎంఓ బాలు యాదవ్ సందర్శించారు. విద్యార్థులకు ఏర్పాటు చేసిన బెంచీలు, లైబ్రరీ, ల్యాబ్‌లు పరిశీలించి పాఠశాల బృందాన్ని అభినందించారు. ఎంఈఓ రాజు నాయక్, సీఆర్పీ జనార్దన్, హెచ్ఎం నర్సింహులు ఉన్నారు.

సమావేశానికి తరలిరండి

చిన్నచింతకుంట: బీడీ కూలి పెంపునకై ఈనెల 24న టీఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించే సమావేశానికి మండలంలోని కార్మికులంతా అధిక సంఖ్యలో తరలి రావాలని జిల్లా అధ్యక్షుడు పి యాదగిరి పిలుపునిచ్చారు. గురువారం చిన్నచింతకుంటలో ఫ్యాక్టరీ వద్ద కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఫ్యాక్టరీ యాజయాన్యం కార్మికులను చిన్నచూపు చూస్తుందన్నారు. వెంకటన్న, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణం అడ్డగింత



ఆందోళన చేస్తున్న చక్రాపూర్ గ్రామస్తులు

అడ్డాకుల: మూసాపేట మండలం జానంపేట శివారులో నిర్మిస్తున్న హెచ్‌బీఎల్ పరిశ్రమ ప్రహరీ పనులను గురువారం చక్రాపూర్ గ్రామస్తులు అడ్డుకున్నారు. చక్రాపూర్ గ్రామానికి వెళ్లే బీటీరోడ్డు పక్కనే మిషన్ భగీరథ పైప్‌లైన్ ఉంది. కాగా ఇక్కడ ప్రహరీ నిర్మాణం చేపడుతుండగా మిషన్ భగీరథ పైప్‌లైన్ లోపలి వైపునకు వస్తోంది. దీంతో పైప్‌లైన్‌కు స్థలాన్ని వదిలి పెట్టి ప్రహరీ నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తూ చక్రాపూర్ గ్రామస్తులు పనులను అడ్డుకున్నారు. భవిష్యత్‌లో పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయాల్సి వస్తే లోపలికి వచ్చి చేయలేని పరిస్థితులు ఏర్పడుతాయని, ఇప్పుడే కొంతదూరంలో చేయించాలని డిమాండ్ చేశారు. కాగా కంపెనీ నిర్వాహకులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని అక్కడున్న కాంట్రాక్టర్లు చెప్పడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, ఆంజనేయులు, రమేష్, బోయ విష్ణు, వెంకటేష్, సుదర్శన్‌గౌడ్, ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం



ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్‌లు, అధ్యాపకులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ అటవీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈమేరకు క్రిష్టియన్‌పల్లిలో విద్యార్థులు ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ పద్మావతి మాట్లాడుతూ ప్రతిఒక్కరు బాధ్యతగా పర్యావరణాన్ని పరిరక్షించి, అడవులను కాపాడాలని, వాటి ద్వారా జీవవైవిధ్యం మెరుగుపడుతుందని అన్నారు. ప్రతిఒక్కరు తమ ఇంటి ఆవరణలో మొక్కలు నాటడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. చెట్లు లేకపోతే భూమి మీద మానవ మనుగడ ప్రశ్నార్థకమవుతందన్నారు. ఎన్ఎస్ఎస్ అధికారులు రాఘవేందర్, స్వరూప, నిరంజన్‌గౌడ్, నాగరాజు, బాలరాజు, వీణ తదితరులు పాల్గొన్నారు.

జములమ్మకు బోనాల సమర్పణ



కందూర్‌లో అమ్మవారికి బోనాలను సమర్పిస్తున్న మహిళలు

అడ్డాకుల: మండలంలోని కందూర్ గ్రామంలో ఇటీవల పునర్నిర్మాణం చేపట్టిన ఆలయం వద్ద జములమ్మ విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించారు. ఈనేపథ్యంలో గురువారం ఆలయం వద్ద బోనాల సమర్పణ కార్యక్రమాన్ని చేపట్టారు. మహిళలు కొత్త కుండలతో బోనాలను సిద్ధం చేసుకుని గ్రామంలోని ప్రధాన వీధుల్లో ఊరేగింపు చేపట్టారు. తర్వాత ఆలయం వద్దకు చేరుకుని అక్కడ ఆలయం చుట్టు బోనాలతో ప్రదక్షిణ చేశారు. తర్వాత ఆలయంలోని అమ్మవారికి బోనాలను సమర్పించి మొక్కులను తీర్చుకున్నారు. గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది.

గాంధీ ట్రస్టు భూములపై విచారణ



విచారణ చేపట్టిన తహసీల్దార్ సత్యనారాయణరెడ్డి

జడ్చర్ల: పట్టణంలోని గాంధీ ట్రస్టుకు సంబంధించి భూముల ఆక్రమణ, తదితర వాటిపై స్థానిక తహసీల్దార్ సత్యనారాయణరెడ్డి గురువారం విచారణ చేపట్టారు. సామాజిక వేత్తలు అనిల్‌కుమార్, ఎంబీ బాలకృష్ణ, మహిపాల్‌రెడ్డి, వెంకటేశ్, తదితరులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయడంతో ఆయన ట్రస్టు భూముల వివరాలను సేకరించి పరిశీలించారు. భూములను ట్రస్టు ఇన్‌చార్జ్‌లుగా చెప్పుకుంటున్న వారు అక్రమంగా విక్రయిస్తున్నారని ఈసందర్భంగా వారు తహసీల్దార్‌కు వివరించారు. అంతేగాక కొందరు ప్రజాప్రతినిధులు అక్రమించుకుని ప్రహరీ నిర్మించారని తెలిపారు. ప్రహరీని కూల్చివేసి ట్రస్టు భూములను స్వాధీనం చేసుకోవాలని, ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి జోక్యం చేసుకుని గాంధీ ట్రస్టు భూములను ప్రజోపయోగకరమైన వాటికి వినియోగించేలా చర్యలు చేపట్టాలని కోరారు.

ఓటుహక్కు వినియోగించుకోవాలి

నవాబుపేట: ప్రజలు ఎన్నికల సమయంలో నిబంధనలు పాటిస్తూ శాంతి భద్రతలకు భంగం వాటిల్లకుండా సహకరించాలని ఎస్ఐ అభిషేక్‌రెడ్డి అన్నారు. గురువారం చాకలపల్లిలో శాంతి సమావేశం నిర్వహించారు. ఎన్నికలు ప్రశాంతంగా సాగేందుకు సహకరించాలన్నారు. ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు.

ఉన్ని సంఘం పటిష్టతకు చర్యలు



మాట్లాడుతున్న పరిమళ

భూత్పూర్: రాబోయే రోజుల్లో ఉన్ని సంఘాలను పటిష్టం చేసేందుకు సంఘం సభ్యులకు, రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు టీఎస్ కోఆపరేటివ్ యూనియన్ మహబూబ్‌నగర్ జిల్లా ఇన్‌చార్జ్ వై. పరిమళ తెలిపారు. గురువారం మున్సిపాలిటీలోని అమిస్తాపూర్ ఉన్ని సంఘం కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చి ప్రసంగించారు. ఉన్ని సంఘాల ద్వారా జరిగే లాభాలు, ఎన్నికల నిర్వహణ, మెంబర్ షిప్, సంఘాల లావాదేవీల గురించి వివరించారు. కార్యక్రమంలో అమిస్తాపూర్ సంఘం అధ్యక్షురాలు చెన్నమ్మ, సంగీత, వసంత, విజయలక్ష్మి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం విక్రయం: కేసునమోదు

రాజాపూర్: మండల పరిధిలోని తిరుమలాపూర్‌లో గురువారం కానిస్టేబుల్స్ వరప్రసాద్, సుదర్శన్‌లు పెట్రోలింగ్ నిర్వహిస్తూ.. వడ్డె లక్ష్మమ్మ అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా పట్టుకున్నారు. ఎక్కువ ధరలకు విక్రయిస్తుండటంతో పాటు ప్రభుత్వ అనుమతి లేకపోవడంతో ఆమె ఇంట్లో నిల్వ ఉంచిన 18 బీరుబాటిళ్లను, 11 లీటర్ల విస్కీ బాటిళ్లను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మహిళా కానిస్టేబుల్ స్వరూప తదితరులు ఉన్నారు. ఈ మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవి వివరించారు.

అడ్డాకుల: మండలంలోని కాటవరంలో గొల్లపాలెం కొల్లంపల్లి కిరాణం షాపులో గురువారం మద్యం సీసాలను పట్టుకున్నట్లు ఎస్ఐ ఎం.శ్రీనివాస్ తెలిపారు. సమాచారం అందడంతో తనిఖీలు చేయగా వివిధ రకాల బ్రాండ్లకు చెందిన 20 లీటర్ల మద్యాన్ని పట్టుకుని ఠాణాకు తరలించినట్లు వివరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అంబులెన్సులో ప్రసవం

గండేడ్: చిన్నవార్వాల్‌కి చెందిన జి.రామకృష్ణ భార్య లక్ష్మీ గర్భవతిగా ఉంది. కాగా గురువారం తెల్లవారు జాము నుంచి ఆమెకు పురిటి నొప్పులు ప్రారంభం అయ్యాయి. దీంతో ఆమె భర్త 108ను సంప్రదించారు. కాగా అంబులెన్సులో ఆస్పత్రికి తీసుకెళ్తుండగా.. గాధిర్యాల్ గేటు సమీపానికి రాగానే ఆమెకు నొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో సిబ్బంది వాహనాన్ని రోడ్డు పక్కన ఆపారు. ఆమెకు పురుడు పోశారు. పండంటి ఆడబిడ్డ జన్మించింది. తల్లి బిడ్డ ఇద్దరూ కూడ క్షేమంగా ఉన్నారని.. ప్రసవం అనంతరం వారిని గండేడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించామని సిబ్బంది తెలిపారు.

ప్రజలు ఆలోచించి ఓటువేయాలి



కార్యకర్తలతో మాట్లాడుతున్న డీకే అరుణ

పాలమూరు: పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని.. బీఆర్ఎస్ అభ్యర్థి ఎలాంటి వ్యక్తో మీకు తెలుసునని, ఇక కాంగ్రెస్ అభ్యర్థి అయితే పాలమూరుకు పరిచయం చేసుకోవడానికి తంటాలు పడుతున్నాడని బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ అన్నారు. బీజేపీ రాష్ట్ర నాయకులు బాలన్న ఆధ్వర్యంలో గురువారం మూసాపేట, భూత్పూర్, కొత్తకోట, అడ్డాకుల మండలాలకు చెందిన వంద మంది బీజేపీ కార్యకర్తలు పట్టణంలోని డీకే అరుణ నివాసంలో ఆమెను సన్మానించారు. 'దేశంలో కోసం మోదీ.. పాలమూరు కోసం అరుణమ్మ' నినాదాన్ని ప్రతికార్యకర్త ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అభ్యర్థిని ఎమ్మెల్యేను చేసిందే తాను అని.. లేకపోతే అతడికి రాజకీయ భవిష్యత్ ఉండేది కాదన్నారు.

ఆరోపణలతో మైలేజ్ రాదు

డీకే అరుణపై ఆరోపణలు చేస్తే మైలేజ్ పెరుగుతుందని అనుకుంటే తప్పు అని.. అలాంటి విమర్శలతో నష్టపోయేది వంశీచందర్‌రెడ్డేనని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కార్యాలయంలో గురువారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. దమ్మున్న నాయకుడు మారెడ్డి బిడ్డ సీఎం రేవంత్‌రెడ్డి అంటూ జితేందర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఎందుకు ఖండించలేదన్నారు. 2019ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయి ఐదేళ్ల పాటు పాలమూరు ప్రజలకు కన్పించకుండా పోయి.. మళ్లీ ఐదేళ్ల తర్వాత ఎన్నికల సందర్భంలో కన్పించి మళ్లీ 2024 పార్లమెంట్ ఎన్నికల సమయంలో ప్రత్యక్షమయ్యారని ఆరోపించారు. కల్వకుర్తి ఎమ్మెల్యే టిక్కెట్‌ను డబ్బులు తీసుకుని అమ్ముకున్నారని ఆరోపణలు వస్తే ఎందుకు స్పందించలేదన్నారు. కాంగ్రెస్ మాదిరిగా నాయకుల ఇళ్ల దగ్గరకు వెళ్లి పార్టీలోకి రావాలని ఆహ్వానించే సంస్కృతి బీజేపీలో లేదన్నారు. చిల్లర ఆరోపణలు చేయడం మానుకోవాలన్నారు. నేతలు కృష్ణవర్ధన్‌రెడ్డి, క్రిస్టియన్‌నాయక్, బుచ్చిరెడ్డి, అంజయ్య, రామాంజనేయులు, చిన్న వీరయ్య, కిరణ్ కుమార్‌రెడ్డి, ప్రవీణ్‌యాదవ్, గోవింద్ నాయక్, నారాయణయాదవ్, బుడ్డన్న పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపు కోసం పనిచేయాలి

దేవరకద్ర: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కోసం కృషి చేయాలని అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి కోరారు. గురువారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో దేవరకద్ర, కౌకుంట్ల మండలాలకు చెందిన పార్టీ బీఎల్ఏల సమావేశంలో ఆయన మాట్లాడారు. విజయంలో పాలు పంచుకోవాలని కోరారు. బీఎల్ఏలు బూత్‌స్థాయిలో పనిచేయాలని ప్రతిఓటరును కలుసుకుని గెలుపు కోసం కృషి చేయాలని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి కోరారు. ప్రత్యేకంగా రూపొందించిన యాప్ గురించి అవగాహన కల్పించారు. మార్కెట్ మాజీ చైర్మన్ అరవింద్‌రెడ్డి, మండలాల అధ్యక్షులు అంజల్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు గోవర్ధన్ యాదవ్, నాయకులు హన్మంతరెడ్డి, భారతమ్మ, వర్మ, జవహర్, వేణుగోపాల్, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

అడ్డాకుల: మూసాపేట మండలం సంకలమద్ది గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు గురువారం ఆపార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరారు. డీసీఎం అసోసియేషన్ అధ్యక్షుడు మదీనా హైమద్, మన్నెంకొండ, గంగుల రాజు, శేఖర్ తదితరులు దమగ్నాపూర్‌లో ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. మండలాధ్యక్షుడు శెట్టిశేఖర్, నారాయణ, అంజనేయులు, రత్నయ్య యాదవ్, వంశీ తదితరులు ఉన్నారు.

రైతులను మోసం చేసిన బీఆర్ఎస్

స్టేషన్ మహబూబ్‌నగర్: అధికారంలో ఉన్నప్పుడు రైతులను పట్టించుకోని బీఆర్ఎస్ పార్టీ నాయకులు మొసలికన్నీరు కారుస్తూ పార్లమెంట్ ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు ప్రయత్నిస్తున్నారని కాంగ్రెస్ సీనియర్ హనీఫ్ అహ్మద్ గురువారం ఓ ప్రకటనలో విమర్శించారు. పార్లమెంట్‌లో రైతు నల్ల చట్టాలకు అనుకూలంగా మద్దతునిచ్చి, రైతు పండించిన పంట నీటిలో కొట్టుకుపోయి రోదిస్తున్న పట్టించుకోని బీఆర్ఎస్ నాయకులు ఈ రోజు కాంగ్రెస్ పార్టీని నిందించడం హాస్యాస్పందగా ఉందన్నారు. ఆ పార్టీ రైతులను మోసం చేసిందన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి